క్లుప్తంగా

అనార్‌పల్లి జీపీ సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న అంజద్‌పాషా

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామ పంచాయతీని మంగళవారం ఎంపీడీవో అంజద్ పాషా సందర్శించారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీరోజు శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యలను నోట్ చేయాలన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి దూరంగా చెత్తను పడేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

'స్టార్ ఈఎంటీ'గా సంజీవ్ కుమార్ ఎంపిక


అవార్డు అందుకుంటున్న సంజీవ్

లింగాపూర్: మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌లో మెడికల్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న పవార్ సంజీవ్ కుమార్‌కు, జీవీకే ఐఎంఈఆర్ఐ సంస్థ నుంచి స్టార్ ఈఎంటీ అవార్డు లభించింది. అతను చేసిన సేవలను గుర్తించి మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వామి, కుమురం భీం జిల్లా మేనేజర్ మెరుగు నరేశ్ పాల్గొన్నారు.

బాకీకార్డులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు


నవేగాంలో కాంగ్రెస్ బాకీకార్డులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ అమలు చేయని హామీలను ప్రజలకు కాంగ్రెస్ చెల్లించాల్సిన బాకీలుగా పేర్కొంటూ మంగళవారం సిర్పూర్(టి) మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాకీకార్డులు పంపిణీ చేశారు. మండలంలోని నవేగాం గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందించాల్సిన హామీ బాకీలు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు అస్లాం బిన్ సమద్, షేక్ చాంద్, లక్ష్మణ్, నందాజీ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ బియ్యం పట్టివేత

బెజ్జూర్: పేదలకు అందాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు నిల్వ ఉంచగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ రాజ్ పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన షేక్ తాజొద్దీన్ అక్రమ రవాణా చేసేందుకు బియ్యం సిద్ధంగా ఉంచినట్లు పక్కా సమాచారం రాగా తనిఖీలు చేపట్టారు. ఆటోలో ఉన్న 8 బస్తాల రాయితీ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఇస్తున్న సన్న బియ్యం అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

భీంపూర్: కేంద్రంలోని బీజేపీ ఓటు చోరీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ మండల నాయకుడు దాసరి రమేశ్ ఆరోపించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. బీజేపీ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను అణిచివేయాలని చూస్తోందని ఆరోపించారు. నాయకులు రేణిగుంట్ల శ్రీనివాస్, గోవర్ధన్, కాసిం, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

ఇచ్చోడ: గుండెపోటు వచ్చిన వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చునని మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ మహేశ్ అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్, నర్సాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని రాయిగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మంగళవారం సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం ఆత్రం భాస్కర్, ఏఎన్ఎంలు జూరు బాయి, నీలలు ఉన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని సిరికొండ బస్టాండ్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో సీహెచ్‌వో బ్రహ్మానందరెడ్డి, హెల్త్‌అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, సుభాష్, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు..!

- సీసీ కెమెరాలతో నేరాల అదుపు
- బస్టాండ్, కూడళ్లలో బిగింపు
- శాంతి భద్రతల దృష్ట్యా ఎన్నో ప్రయోజనాలు

కెరమెరి: కెరమెరిలో ట్రాఫిక్ నియంత్రణ, నేరాల అదుపునకు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలతో మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా, వాహనాలపై అతి వేగంగా వెళ్లినా, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా, గొడవలకు దిగినా తదితర దృశ్యాలన్ని పోలీస్‌స్టేషన్‌లోనే ఉంటూ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. కెరమెరిలో ఇటీవల రూ.2.50 లక్షల ఖరీదు గల 16 సీసీకెమెరాలు బిగించారు.

దొంగలను గుర్తించడం సులభం..

గతంలో మండల కేంద్రంలో ఏం జరిగినా పోలీసులకు తెలిసేది కాదు. ఎవరైనా ఫోన్ చేసి చెప్తేనే సమాచారం అందేది. కానీ మండల కేంద్రంలోని బస్టాండ్‌తో పాటు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు బిగించడంతో మండలంలో జరుగుతున్న వ్యవహారమంతా పోలీసులు పోలీస్‌స్టేషన్ నుంచే పర్యవేక్షిస్తున్నారు. దీంతో రోడ్లపై వాహనాలు నిలపడం, అతి వేగంగా వాహనాలు నడపడం చాలా వరకు తగ్గాయి. రోడ్లపై ఎవరైనా గొడవలు పడడం, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం వంటి వాటిని పోలీసులు పూర్తిగా అరికట్టారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు వస్తే ఇట్టే తెలిసిపోతుంది. అనుమతి లేకుండా ధర్నాలు, ఆందోళనలు చేస్తే వారిని అదుపులోకి తీసుకున్న సంఘటనలు సైతం ఉన్నాయి. తప్పు చేస్తే సీసీ కెమెరాలతో ఇట్టే దొరికిపోతామనే భావన అందరిలోనూ ఏర్పడింది. దీంతో నేరాలు చాలా వరకు తగ్గాయి. సీసీ కెమెరాల వల్ల దొంగలను సైతం సులభంగా పట్టుకోవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు.


పోలీస్‌స్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజీ దృశ్యాలు

శబ్దం చేసే కెమెరాలు

మండల కేంద్రంలో కొత్త టెక్నాలజీతో కూడిన సీసీకెమెరాలు బిగించారు. ప్రధాన కూడళ్లలో ఒక్కో స్తంభానికి రెండేసి కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు పది మీటర్ల దూరం నుంచి వస్తున్న మనిషిని సైతం గుర్తిస్తాయి. వ్యక్తి సమీపంలోకి రాగానే కెమెరా బల్బు వెలగడంతో పాటు కెమెరా ఆధీనంలో ఉన్నట్లు తెలియపరుస్తుంది. ఈ టెక్నాలజీతో దొంగలు తప్పించుకోలేరని పోలీసులు చెబుతున్నారు.

అన్ని గ్రామ పంచాయతీల్లో..

ఇప్పటి వరకు మండల కేంద్రానికి పరిమితమైన సీసీ కెమెరాలను త్వరలో గ్రామ పంచాయతీ కేంద్రాల్లో కూడా అమర్చనున్నారు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రధాన కూడళ్ల వద్ద కనీసం రెండు కెమెరాలైనా అమర్చాలని పోలీసులు భావిస్తున్నారు.


బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నేరాల నియంత్రణ..



మండలకేంద్రంలో సీసీకెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది. సీసీ కెమెరాలతో అనుమానిత వ్యక్తులను, దొంగలను, దాడులు చేసిన వారిని గుర్తించడం సులభమవుతుంది. సీసీ కెమెరాల ద్వారా మండల కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. – ఎస్. మధుకర్, ఎస్సై

చేపల వల.. పంటకు రక్ష


కెస్లాగూడ సమీపంలో పంటకు రక్షణగా అమర్చిన చేపల వల

కెరమెరి: పంటలను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మండలంలోని పాటగూడ గ్రామ శివారులో, కెస్లాగూడ ప్రాజెక్టు సమీపంలో వేసిన పంటల చుట్టూ రక్షణకు చేపలు పట్టే వలను అమర్చారు. వలతో కోతులు, పందుల నుంచి పంటలకు రక్షణ ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మండలంలోని అనేక గ్రామాల్లోని పంట పొలాల్లో పత్తి పంట పండిస్తున్నారు. అడవి పందులతో పాటు కోతులు వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు పంటల రక్షణకు వినూత్నంగా ఆలోచిస్తున్నారు.

ఐద్వా నూతన గ్రామ కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గొడవెల్లిలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి అనంతరం ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నంది పద్మ సమక్షంలో ఐద్వా నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బట్టు రాధ, ప్రధాన కార్యదర్శిగా భూలక్ష్మి, కోశాధికారిగా మామిడి రాధిక, సహాయ కార్యదర్శిగా పుష్పలత, ఉపాధ్యక్షులుగా రేఖ, లక్ష్మి, శిరీష, కమిటీ సభ్యులుగా పద్మ, సుశీల, సారిక, నసీమ, సునీత, లక్ష్మి, పార్వతి, విమలను ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నంది పద్మ మాట్లాడుతూ మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మహిళా కూలీలకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్ అసంఘటిత రంగాల్లో పని చేసే మహిళలకు సామాజిక భద్రత కల్పించాలని, పింఛన్, మెటర్నిటీ లీవ్‌లు ఇవ్వాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహాయ కార్యదర్శి పద్మ

102, 108 అంబులెన్స్‌ల తనిఖీ

లింగాపూర్: జైనూర్ మండల కేంద్రంలో మంగళవారం 102, 108 అంబులెన్స్ వాహనాలను జిల్లా మేనేజర్ నరేశ్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లు, మెడికల్ స్టాక్ పరికరాలు పని చేస్తున్న తీరు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఫోన్‌కాల్ వచ్చిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా అంబులెన్స్‌లు బయలుదేరాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట టెక్నీషియన్ రవి, పైలెట్ ఉద్ధవ్, పరమేశ్వర్ పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న నరేశ్ యాదవ్

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకే సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్) ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందని, ఎస్ఎఫ్ఐ సంఘంలో సభ్యులుగా చేరాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య, తరగతి గదులు సరిపడా లేవని, డైనింగ్ హాళ్లలో విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారని, మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగ్గా లేవని, వెంటనే వీటి నిర్మాణానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు దీపక్, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సాయికుమార్

ఘనంగా పోషకాహార వారోత్సవాలు

వాంకిడి: మండలంలోని లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాలతో కూడిన ఆహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తుందని తెలిపారు. అనంతరం బాలలకు అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రాజ్‌కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.


బాలలకు అక్షరాభ్యాసం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ ఆవరణలో ఉన్న కాలభైరవ స్వామిని దర్శించుకునేందుకు మంగళవారం భక్తులు పోటెత్తారు. అష్టమి పురస్కరించుకుని కాలభైరవ స్వామిని దర్శించుకునేందుకు మండలంలోని భక్తులతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కాలభైరవ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కనక దుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో దీపాలు వెలిగించి అమ్మవారిని వేడుకున్నారు. ఆలయం వెనుకభాగంలోని గుహలో ఉన్న మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

లర్నింగ్ ప్రోగ్రాం పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్: ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రాంను పకడ్బందీగా అమలు చేయాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. మండలంలోని తాడేహత్నూర్ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో ఇంగ్లిష్ ఫౌండేషన్ లర్నింగ్ ప్రోగ్రాం అమలు తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు విద్యార్థులతో చదివించారు. ఈ ప్రోగ్రాం అమలు తీరు పరిశీలించేందుకు బుధవారం మండల కేంద్రానికి కలెక్టర్ రానున్నట్లు తెలిపారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జాదవ్ శ్రీనివాస్, ఉపాధ్యాయుడు జితేందర్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 42 మందిని పరీక్షించగా 21 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారికి విడతల వారీగా ఆపరేషన్ చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి –చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 18 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కాగా వీరిని లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వాహకులు శ్రీనాథ్, గోపి తెలిపారు.


కంటి వైద్యశిబిరంలో పరీక్షిస్తున్న వైద్యుడు

స్వదేశీ ఉత్పత్తులు నిర్లక్ష్యం చేయొద్దు

రెబ్బెన: స్వచ్ఛంగా, నాణ్యతగా ఉండే స్వదేశీ ఉత్పత్తులపై ప్రతీ ఒక్కరు ఆసక్తి చూపాలని విదేశీ వస్తువుల మోజులో పడి స్వదేశీ వస్తువులను నిర్లక్ష్యం చేయొద్దని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాదీమేళా స్టాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్టాల్‌లో ప్రదర్శన, విక్రయానికి ఉంచిన వస్త్రాలను పరిశీలించారు. ఈనెల 19 వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని, వస్త్రాల కొనుగోలుపై 25 నుంచి 40 శాతం వరకు రాయితీ ఉంటుందన్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు కృష్ణమూర్తి, డీజీఎం ఉజ్వల్‌కుమార్, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, నిర్వాహకులు చంద్రమౌళి, అభిషేక్ పాల్గొన్నారు.


స్టాల్ ప్రారంభిస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

18లోపు అపార్ నమోదు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 18 లోపు అపార్ ఐడీ తప్పకుండా తీసుకోవాలని ఎస్వో అబిద్ అలీ సూచించారు. మంగళవారం కాగజ్‌నగర్‌లోని ఫాతిమా పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో హెచ్ఎంలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ప్రతీ ఒక్క విద్యార్థికి అపార్ ఐడీ ఉండాలని, ఐడీతోనే విద్యార్థుల పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల18 లోపు 5 నుంచి 15 సంవత్సరాలు గల విద్యార్థుల ఎంబీయూ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్వో అబిద్ అలీ

పరిశీలించి.. సూచనలు చేసి

ఆసిఫాబాద్‌రూరల్: జైనూర్, సిర్పూర్(యూ) మండల కేంద్రాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి సందర్శించారు. వంట గదులు, తరగతి గదులు పరిశీలించి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం దబోలి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాశాఖ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

దహెగాం: మండలంలోని పశువులకు బుధవారం నుంచి గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపడుతామని మండల పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు. పశువులకు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు ఉచితంగా వేస్తామన్నారు. మూడు నెలల పైబడిన పశువులకు టీకాలు వేస్తామన్నారు. పాడి రైతులు గ్రామాలకు పశువైద్య సిబ్బంది వచ్చినప్పుడు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఆవులు, గేదెలకు బుధవారం నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వనున్నట్లు పశువైద్యాధికారి పరిమళ మంగళవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం వచ్చే నెల 14 వరకు కొనసాగుతుందన్నారు. ఆవులు, గేదెలు, దూడలకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న అటవీ అధికారులు

లింగాపూర్: మండలంలోని మోడిగూడ గ్రామంలో తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథలుగా మారిన ఆరుగురు పిల్లలకు అటవీ అధికారులు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఎఫ్ఎస్‌వో అనూష, బీట్ అధికారి మహేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా న్యూ స్వాగత్ హోటల్ సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. బైక్‌పై మారెపల్లి గ్రామానికి చెందిన దంపతులు కాగజ్‌నగర్‌లోని ఆసుపత్రికి వచ్చి తిరిగి వెళ్తుండగా న్యూ స్వాగత్ హోటల్ సమీపంలో ఓ ఆటో అతివేగంగా వచ్చి వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న దంపతులకు స్వల్పగాయాలయ్యాయి.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

లింగాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం సేంద్రియ వ్యవసాయ విధానాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో సంజయ్‌కుమార్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. డీఏహెచ్‌పీఎస్ సమన్వయకర్త దేవిదాస్, రమాదేవి, శేఖర్, సంతోష్ రైతులు పాల్గొన్నారు.

భోగి పూజతో దండారీ ఉత్సవాలు

నార్నూర్: మండలంలోని ఎంపల్లి గ్రామంలో మంగళవారం భోగి పూజలు నిర్వహించి దండారీ ఉత్సవాలను ప్రారంభించారు. గుస్సాడీ టోపీలు, వాయిద్యాలకు ఆదివాసీ గిరిజనులు పూజలు చేశారు. తరతరాల నుంచి సంస్కృతి, సంప్రదాయం ప్రకారం ఎత్మాపూర్ సెన్కు పూజలు చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు. గ్రామపటేల్ పెందూర్ అమృత్‌రావు, గ్రామపెద్దలు పెందూర్ సంతోష్, చిత్రు, రాము, పెందూర్ ఆనందరావు, పూసం బాదిరావు, కొట్నాక్ భీంరావు, మాడవి జలపత్‌రావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగోబా అకాడమీ సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా స్టేడియంలో నిర్వహిస్తున్న నాగోబా అకాడమీని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ కోరారు. మంగళవారం నాగోబా క్రీడా, పోలీసు రిక్రూట్‌మెంట్ అకాడమీని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల యువత, విద్యార్థుల కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం,సాయంత్రం పోలీస్, ఆర్మీ శిక్షణతోపాటు పిల్లలకు వ్యాయామ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, యువకులు ఉన్నారు.

ఘనంగా ధమ్మ దీక్ష దినోత్సవం

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బౌద్ధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధమ్మ దీక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ 1956లో అక్టోబర్ 14న అంబేడ్కర్ దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 6లక్షల మందికి బౌద్ధ ధమ్మ దీక్ష ఇచ్చారన్నారు. బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి త్రీశరణ్, పంచశీల పూజలు నిర్వహించారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, జైరాం ఉప్రే, విజయ్ ఉప్రె, రోషన్ ఉప్రె, శ్యాంరావు దుర్గె, రాజేశ్వర్ పాల్గొన్నారు.


బుద్ధ పూజ చేస్తున్న బౌద్ధులు